# సింగిల్ పేజీ కథలు

## అత్తగారి లాజిక్

ప్రత్యూషకి పెళ్ళయి ఆర్నెల్లయింది. ఆమె భర్త సూర్యం బ్యాంకులో పనిచేస్తున్నాడు. అందచందాలలో, స్థితిగతులలో ఒకరికొకరేం తీసిపోరు. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అంటారందరూ.

ఇద్దరూ అన్యోన్యంగానే ఉంటారు. కానీ ఎంత అన్యోన్య దంపతుల కాపురంలోనైనా, అప్పుడప్పుడు అలకలు, చిరాకులు మూతి బిగింపులు మామూలుగా కన్పించే విషయాలు. నిజానికి అవన్నీ ఉన్నప్పుడే థ్రిల్ అన్న విషయం తెలిసేంత వయసులేదు ఆ కొత్తదంపతుల కాపురానికి.

సూర్యం తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయారు. అన్న దగ్గర పెరిగాడు. నలుగురు అక్కల తర్వాత పుట్టిన సూర్యం. అతని అన్న బి.హెచ్.ఇ.ఎల్.లో పనిచేస్తాడు. అతని కొలీగ్ కూతురే ప్రత్యూష. సూర్యం విజయవాడలో పనిచేస్తున్నాడు. కూతురిచేత విజయవాడలో కాపురం పెట్టించాకా అప్పుడప్పుడు ప్రత్యూష తల్లిదండ్రులు వచ్చి చూసిపోతున్నారు. వచ్చినప్పుడల్లా తమ ఆఖరి కూతురు అల్లుడి మీద చెప్పే కంప్లయింట్స్ వింటూ హాయిగా నవ్వుకునేవారు. ప్రత్యూష తల్లి కామేశ్వరి కూతుర్ని సముదాయించేది.

ఎప్పటిమాదిరిగానే ప్రత్యూష తల్లిదండ్రులు ఈరోజు మళ్ళీ వచ్చారు. విజయవాడలోని బంధువుల ఇంట్లో పెళ్ళి ఉంది. రాగానే కామేశ్వరి కూతురి యోగక్షేమాలు అడగడం, ప్రత్యూష ఫిర్యాదుల ఫైళ్ళని తెరవడం జరిగిపోయింది.

''మీ అల్లుడు మంచివాడని తెగ మురిసిపోతావు. చూడు ప్రొద్దుట ఎనిమిదింటికి బ్యాంకుకు పోయినాయన ఇంతవరకూ రాలేదు'' కంప్లైంట్లపర్వంలో ఇది ఆఖరిఘట్టం.

''ఏదో ఆడిటింగ్ ఉందన్నాడు కదమ్మా. లేటవుతుందని చెప్పాడుగా'' అంది. ఆ చాప్టర్‌కి ముగింపు ఇచ్చేద్దామని కామేశ్వరి.

కాని ప్రత్యూష అసలు సమస్యకి శ్రీకారం చుట్టింది ఇక్కడే.

''నువ్వన్నింటికీ అలాగే ఆయనని వెనకేసుకొస్తావు. రేపుదయం పెళ్ళి కదా! చీర కొనాలని చెప్పాను. రేపు ఆదివారం కదా!''

''మరే! అయినా వచ్చేటప్పుడు తెస్తాడేమోనే!''

''అన్నావా! అంటావు, ముచ్చటైన మూడో అల్లుడు కదా! రానీ అదీ చూద్దాం!'' అని మూతి మూడు వంకర్లు తిప్పింది ప్రత్యూష.

''ఏం చోద్యమే'' అనుకుని కామేశ్వరి కుడిచేతి



వేళ్ళు చెంపలకు చేర్చుకుంది, తమ చిన్నప్పటి రోజుల్ని వర్తమానంతో పోల్చేసుకుంటూ.

సూర్యం వచ్చేసరికి తొమ్మిదిన్నర అయింది.

''చీర తెచ్చారా?'' రాగానే గుమ్మంలోనే నిలదీసింది ప్రత్యూష.

''సారీ ప్రత్యూ! చాలా బిజీ వర్క్ తప్పలేదు. అయినా బాధ్యతగల జాబ్‌కదా! రేపు తెస్తానులే''

''సారూ! రేపు ఆదివారం గుర్తుందా?'' రాగయుక్తంగా చెప్పింది ఆమె.

ఆమె ఫోజుకి సూర్యం నవ్వి, ''నిజమే అనుకో. అయినా నీకు మంచి చీరలెన్ని లేవూ? ఏదో ఒకటి కట్టుకో'' ఒక సలహా పడేశాడు.

వాళ్ళిద్దరి సంభాషణ కామేశ్వరి మౌనంగా వింటోంది.

''నథింగ్ డూయింగ్. కొత్తచీరని ఎందుకు ప్రామిస్ చేశారు? అది లేకపోతే నేను పెళ్ళికి రాను'' ఖండితంగా తేల్చేసింది ప్రత్యూష.

అత్తగారి ఎదురుగా తన మర్యాదకి ఏదో తక్కువైందని అనుమానం వచ్చేసింది సూర్యంకి. అంతే! సీరియస్ అయిపోయాడు.

''అంటే నువ్వు లేకపోతే అక్కడ పెళ్ళి జరగదనా? నువ్వు రాకపోతే మానెయ్. నేను వెళ్ళివస్తా''

అనేసాడు కోపంగా.

జరగాల్సిన డామేజ్ జరిగిపోయింది. ప్రత్యూష అష్టోత్తరం చదివేయడం మొదలుపెట్టింది.

ఇంక సూర్యం ఆగలేక భార్యామణి పెట్టే బాధలన్నిటినీ ఆమెకంటే పెద్దగొంతుతో ఏకరువు పెట్టేసాడు.

పరిస్థితిని కామేశ్వరి అర్థం చేసుకుంది. మరి ఇంక ఆగలేదామె. కూతుర్ని చెడామడా దులిపేసింది. 'అలిసి వచ్చిన భర్తని ఇలాగేనా చూసుకునేది?' అని తిట్టిపోసింది. 'అల్లుడి ముఖం చూసి కొట్టలేదు. సంతోషించు' అని ఒక రిలాక్సేషన్‌ని ప్రకటించింది కామేశ్వరి.

ప్రత్యూష ఏడ్చుకుంటూపోయి పడుకుంది. కామేశ్వరి అల్లుడికి తనే భోజనం పెట్టి ''కాస్త గారాబంగా పెంచాం బాబూ! చిన్నతనంతో అది అనే మాటల్ని పట్టించుకోకేం'' అని సూర్యం బ్రెయిన్‌కి కూడా కాస్త ఫుడ్ అందించింది. నీలాంటి అల్లుడు దొరకడం మా అదృష్టం. అది అన్ని మాటలన్నా కూడా సర్దుకుపోవడం నీ మంచితనం'' అని ఒక సర్టిఫికెట్ కూడా పడేసింది.

మర్నాడు ప్రత్యూష చాలా ఆలస్యంగా లేచింది. భర్త కన్పించకపోయేసరికి ఆమె కంగారుగా తల్లిని అడిగింది. ఆమె జవాబు చెప్పేలోగా గుమ్మంలో సూర్యం ప్రత్యక్షమయ్యాడు.

అతని చేతిలో చీర పాకెట్! తెలుసున్న షాపు తెరిపించి సాధించుకొచ్చాడు.

పాకెట్ విప్పి చీర చూసి చాలా ఆనందపడింది

ప్రత్యూష. ఆకాశ నీలంరంగు ఆమెకెంతో ఇష్టం. అది ఆమె ఒంటికి సూటవుతుందని ప్రక్కింటి పిన్నిగారి కూతురు చెప్పింది మొదలు ఆ చీరకోసం కలవరిస్తోందామె.

ఈ విధంగా ఆమె సరదాని తీర్చాడు సూర్యం. ''అత్తయ్యగారూ! ప్రత్యూని మీరు మరీ ఎక్కువగా తిట్టారు. అసలే అత్తమామలు లేని కోడలు కదా! తన ఇష్టాన్ని నాతోకాక ఎవరికి చెప్పుకుంటుంది? అయినా ఇదంతా నా తప్పే!'' అని బుద్ధిగా ఒప్పేసుకున్నాడు.

అల్లుడి మంచితనం, తన కూతురంటే అతనికెంత ప్రేమో తెలిసిన కామేశ్వరీ ''ఆమాత్రం దారిలో పెట్టాలి బాబూ!'' అంది కోపం చూపిస్తూ. అందరూ పెళ్ళికెళ్ళి వచ్చారు.

ఆ రాత్రి అల్లుడు వినకుండా కామేశ్వరి కూతురికి చెప్పింది.

''నిన్నరాత్రి కాస్త ఎక్కువగానే తిట్టానే అమ్మడూ! తెగేదాకా వ్యవహారాన్ని లాగకూడదు. అందుకే నీమీద అలా కోపం నటించాను.

నేను అలా అనేసరికి అతని మనసు తృప్తిపడుతుంది.

పైగా నీమీద సానుభూతి పెరుగుతుంది కూడాను. చూశావుగా ఫలితం! ఎంతమంచి చీర తెచ్చాడో. వెయ్యి రూపాయలట అది!''

''లేదమ్మా! ఆయన చాలా అమాయకులే!'' అంది ప్రత్యూష.

''అదలా ఉండనీ'' అంది కామేశ్వరి లాజికల్‌గా. అది కూతురికి శిక్షణ లాంటిది కదా!

ఎందుకంటే-ఈనాటి కూతురు రేపటికి కాబోయే అత్తగారేగా!

**-నారాయణ డి.వి.వి.ఎస్.**
**(వనపర్తి)**

# సందేహం

**నాలుగు రోజుల సెలవు తర్వాత పోస్టాఫీస్ తెరవడంతో విపరీతమైన రద్దీగా ఉంది. స్టాంప్స్ వెండర్ ఆరోజు శెలవు పెట్టడంతో ఆ పని కూడా క్లర్క్ గోవిందంపై పడింది.**

యస్.బి. విత్‌డ్రాయల్స్ డిపాజిట్స్ రాసి రాసి చేతులు నొప్పి పుడుతున్నాయి. వెళ్ళేవాళ్ళు వెళుతుంటే, వచ్చేవాళ్ళు వస్తూనే ఉన్నారు. ఊపిరి సలపని పని.

సరిగ్గా ఆ టైంలో వచ్చేడీ కస్టమర్ ''ఈ కవర్‌కి ఎంత స్టాంప్ అంటించాలో చెప్పండి?'' అడిగాడు.

ఎంతో అనుభవమున్న గోవిందం ఆ కవర్ చూడగానే దాని బరువు ఊహించి ''ఐదు రూపాయిలు'' చెప్పాడు.

ఆ వ్యక్తి డబ్బులివ్వడంతో అతనికి స్టాంప్ ఇచ్చి తన పనిలో నిమగ్నమైనాడు. ఐదు నిముషాల తర్వాత రిలాక్సేషన్ కోసం తలెత్తాడు.


ఇందాకా స్టాంప్ కొన్న వ్యక్తి స్టాంప్ అంటించకుండా దాన్ని పరిశీలనగా చూడటం గమనించి ''ఏంటి సార్ అలా చూస్తున్నారు'' అంటూ అడిగాడు.

''అబ్బే ఏం లేదు?'' అంటూ తిరిగి ఆ స్టాంప్‌ని పరిశీలనగా చూడసాగాడు.

గోవిందం తిరిగి తన పనిలో నిమగ్నమైనాడు. మరో పదినిమిషాల తర్వాత మరోసారి తలెత్తాడు. ఇందాకటి వ్యక్తి అప్పటికీ ఆ స్టాంప్ అంటించకుండా అదే పనిగా దాన్ని పరిశీలిస్తున్నాడు.

''ఏమిటి మాస్టారూ? మీ ఇబ్బంది ఏంటో చెప్పండి. మీరలా నుంచొంటే వెనకవాళ్ళకు అడ్డం. మీ డౌట్ ఎంటో చెప్పండి'' చిరాగ్గా అడిగాడు గోవిందం. మిగిలిన జనాలు కూడా అతని వైపు వింతగా చూసారు.

యథాప్రకారం ఆ వ్యక్తి గోవిందం వైపు చూసి ''అబ్బే ఏం లేదు'' అంటూ తిరిగి స్టాంప్ పరిశీలనలో నిమగ్నమైపోయాడు.



గోవిందం చిన్నగా తల కొట్టుకుని తన పనిలో నిమగ్నమైపోయాడు. మరో ఇరవై నిముషాలు గడిచాయి. మరోసారి తలెత్తిన గోవిందానికి అదే దృశ్యం కనిపించింది. దాంతో గోవిందానికి బి.పి. రైజ్ అయ్యింది.

''మాస్టారూ ఇందాక మీకొకసారి చెప్పాను. మీ డౌట్ ఏంటో చెప్పండి?'' కాస్తంత కోపంగా అన్నాడు.

ఆ వ్యక్తి జవాబు చెప్పేలోగా ''అసలో నకిలీనో పరీక్షిస్తున్నాడేమో?'' అన్నారెవరో చిన్నగా.

కిసుక్కున నవ్వారు మరెవరో. స్టాంప్‌ని ఈసారి భూతద్దంలో పరీక్ష చేస్తున్న ఆ వ్యక్తి చిరునవ్వు నవ్వాడు.

ఆ మాట విన్న గోవిందం ''మాస్టారూ దొంగ నోట్లలా దొంగ స్టాంపులు వస్తున్నాయి, నిజమే. కానీ అది దొంగస్టాంపు కాదు, అసలుదే. అంటించండి'' చిరాగ్గా చెప్పి తన పనిలో నిమగ్నమైనాడు.

ఈసారి పోస్టుమాస్టర్‌కి కూడా కోపం వచ్చింది. మరో పదినిముషాలు గడిచాయి. అనుమానంతో తలెత్తి చూసిన గోవిందానికి అదే దృశ్యం కనిపించింది.

''ఏమండీ ఎందుకండీ మా ప్రాణాలు తీస్తారు? అసలెందుకు దాన్నలా పరీక్ష చేస్తున్నారు. పైగా భూతద్దంలో. చెప్పండి ప్లీజ్! మీకు దణ్ణం పెడతాను'' ఈసారి రెండు చేతులు జోడించి అడిగాడు.

''అదికాదు సార్! ఈ స్టాంప్‌కు ఎక్స్‌పైరీ డేట్ ఎక్కడుందోనని చూస్తున్నా'' చెప్పాడు మెడికల్ రిప్రజెంటేటివ్.

'దబ్'మన్న శబ్దం పెద్దగా కావడంతో అందరూ అటువైపు చూశారు. పాపం పోస్టుమాస్టర్ తన పాతికేళ్ళ సర్వీస్‌లో అంత భారీ జోక్ వినక కాబోలు, వెనక్కు కుర్చీతోసహా విరుచుకుపడిపోయి పిచ్చిచూపులు చూడసాగాడు.

**-కలపర్తి సత్యం (ఏలూరు)**